క్లుప్తంగా

పేదలకు నిత్యావసరాల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా–నాగమానసాదేవి మందిరంలో పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా అందజేశారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం మహిళలకు నిత్యావసర వస్తువులతో పాటు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. శ్రీ నాగమానసాదేవి అమ్మవారిని ఎమ్మెల్యే మల్లాది విష్ణు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజాగళం యాత్రలో శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుపై చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలను ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఖండించారు. టిప్పర్ డ్రైవర్‌కు జగన్ ఎమ్మెల్యే సీటు ఇచ్చాడని అవహేళనగా మాట్లాడి చంద్రబాబు తాను కులోన్మాది అని మరోమారు నిరూపించుకున్నారని అన్నారు. పేదల పట్ల, ప్రత్యేకంగా మాదిగల పట్ల చంద్రబాబుకు చులకన భావమని పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతుడైన మాదిగ కులానికి చెందిన వీరాంజనేయులు పొట్టకూటి కోసం డ్రైవరు వృత్తి చేయడం నేరమా? అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు ఎస్సీల్లో ఎవరైనా పుడతారా? అని, బీసీల తోకలు కత్తిరిస్తా అంటూ కులోన్మాదంతో వ్యవహరించి ఆయా వర్గాల ఆగ్రహానికి గురైన విషయాన్ని గుర్తుచేశారు. వీరాంజనేయులును అవమానించే రీతిలో వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు మాదిగలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీవాగ్దేవి కూచిపూడి నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శనివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరిగింది. శివాష్టకం, కొండలలో నెలకున్న కోనేటి రాయుడు వంటి పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కళావేదిక వద్ద చిన్నారుల నృత్య ప్రదర్శనను అద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను అభినందించడంతో పాటు వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లికి చెందిన పడిగల సీతారామయ్య, సుశీల భార్యాభర్తలు. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. పాపకు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. మెరుగైన వైద్యానికి డబ్బులు ఉండటం లేదని ఆవేదన చెందిన సుశీల ఈ నెల 26న ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగింది. సుశీల పరిస్థితిని గమనించిన సీతారామయ్య చెల్లెలు పార్వతి వెంటనే విషయాన్ని అన్నకు చెప్పింది. సుశీలను ఆటోలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వైద్యం అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఘటనపై సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించాలి

పెనమలూరు(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాల సీఎస్ఈ, ఐటీ విభాగాల ఆధ్వర్యంలో హ్యాకథాన్ పేరుతో సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో లక్ష్మణస్వామి మాట్లాడుతూ కంప్యూటర్ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు సైబర్ సెక్యూరిటీకి సంబంధించి వస్తున్న నూతన ఆవిష్కరణలను, మార్పులను గమనిస్తూ వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

- రూ. 3.6 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్
- వేసవి డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు



ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దేవీనగర్, దావుబుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, బుడమేరు మధ్యకట్ట తదితర ప్రాంతాల్లో నిరంతరాయంగా మెరుగైన విద్యుత్ సరఫరా చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇక్కడ ఇప్పటికే పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా రాబోయే రోజుల్లో కూడా విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గద్దె వెంకట్రామయ్యనగర్‌లో రూ. 3.6 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒకప్పుడు విద్యుత్ లోఓల్టేజీ, సమస్యలతో అల్లాడిన ప్రజలకు ఇప్పుడు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. అలాగే వేసవికి కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు పూర్తి చేశారు. నున్న 220కేవీ సబ్‌స్టేషన్ నుంచి జీవీఆర్ నగర్ ట్రెండ్‌సెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు అక్కడ నుంచి శ్రీనగర్‌కాలనీ వరకు రూ. 1.8 కోట్లతో 33కేవీ ప్రత్యేక విద్యుత్ కొత్త లైను ఏర్పాటు చేశారు. దీని వల్ల వేసవిలో విద్యుత్ సరఫరాలో డిమాండ్‌కు అనుగుణంగా నున్న నుంచి కానీ, గుణదల నుంచి కానీ విద్యుత్ తీసుకుని సరఫరా చేసే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దానికి అనుగుణంగా చర్యలు ముందుగానే తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసవి వచ్చిన తర్వాత హడావుడి చేసేవారు కానీ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేవారు కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఎటువంటి హంగామా లేకుండా ప్రజల అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా కోట్లాది రూపాయలతో పనులు పూర్తిచేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

16 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు..

వేసవిలో డిమాండ్‌కు అనుగుణంగా సమస్యలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు డీఈ బీవీ సుధాకర్ ఆదేశాల మేరకు 16 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఎంతో కాలంగా లోఓల్టేజీ, అధిక డిమాండ్, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉన్న ప్రాంతాలను గుర్తించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు విద్యుత్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

విద్యుత్ సరఫరా ఏర్పాట్లు అభినందనీయం



ఒకప్పుడు లోఓల్టేజీ సమస్యలతో విద్యుత్ ఉపకరణాలు తరచూ పాడయ్యేవి. ఇప్పుడు ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. వేసవికి ముందే తగిన ఏర్పాట్లు చేయడం అభినందనీయం.

–డాక్టర్ జాన్ ఆదినారాయణ పెండ్యాల, ప్రొఫెసర్

విద్యుత్ ఉపకరణాలకు రక్షణ



పెరుగుతున్న జనాభా, విద్యుత్ ఉపకరణాలు, డిమాండ్‌కు అనుగుణంగా ముందే అధికారులు చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉంది. విద్యుత్ అధికారుల చర్యల వల్ల విలువైన విద్యుత్ ఉపకరణాలకు రక్షణ ఏర్పడింది. విద్యుత్ అధికారులు తీసుకున్న చర్యల వల్ల విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల మాటే మర్చిపోయాం.

–తోట రవి, వ్యాపారి

వేసవి డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలనే సదుద్దేశంతో రూ. 3.6 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడం జరిగింది. అలాగే వేసవి డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకున్నారు. వేసవిలో ఎంత డిమాండ్ వచ్చినా మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండటం అభినందనీయం.

–శీ జానారెడ్డి, కార్పొరేటర్

విద్యార్థులకు తాగునీటి సదుపాయం అభినందనీయం

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించడం అభినందనీయమని నాల్గవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారామ్ అన్నారు. రాజీవ్‌నగర్‌లోని రాజీవ్ గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నందు కోస్టల్ బ్యాంక్ సీఎస్ఆర్ ఫండ్స్‌తో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంటు, షెడ్‌లను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమంలో జడ్జి పి.రాజారామ్ మాట్లాడుతూ సోషల్ సర్వీసెస్ రెస్పాన్సిబిలిటీని కోస్టల్ బ్యాంక్ అందించినందుకు అభినందించారు. ఆర్ఓ ప్లాంటును ఈ హైస్కూల్లో ఏర్పాటు చేయడానికి న్యాయవాది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ చంద్రగిరి రాధాకుమారి సహాయ సహకారాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంక్ ఏసీఎం ఎస్.మదనమోహన్, రామకృష్ణ, హైస్కూల్ హెచ్ఎం పి.శ్రీనివాసరావు, బీబీఏ ప్రెసిడెంట్ కె.చంద్రమౌళి, బీబీఏ జీఎస్ ఎ.రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న జడ్జి రాజారామ్

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో గుణదల పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామలింగేశ్వరనగర్‌కు చెందిన బెజవాడ శరత్‌బాబు(35) సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం ద్విచక్ర వాహనంపై ముస్తాబాద్ నుంచి రామవరప్పాడు వైపునకు వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన శరత్‌బాబును 108లో ఆసుపత్రికి తరలించారు. శరత్‌బాబు భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టుషాపు నిర్వాహకురాలి అరెస్టు

కంకిపాడు: బెల్టుషాపు నిర్వాహకురాలిని కంకిపాడు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని మారేడుమాక గ్రామానికి చెందిన అరేపల్లి ఝాన్సీ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆమెను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద ఎనిమిది మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఝాన్సీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెల్టుషాపు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎస్ఐ సందీప్ హెచ్చరించారు.

సీఎం జగన్ పాలనలోనే కాపుల సంక్షేమం, అభివృద్ధి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస కుమార్



ఆకుల శ్రీనివాస కుమార్

కాపులకు చేకూర్చిన లబ్ధి రూ.39,247 కోట్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలోనే కాపు సామాజికవర్గ సంక్షేమం, అభివృద్ధి జరిగిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, కాపు నేత ఆకుల శ్రీనివాస కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాపులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు సీఎం జగన్ రానున్న ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 31 మందికి ఎమ్మెల్యే టికెట్లు, ఐదు ఎంపీ సీట్లు ప్రకటించారని తెలిపారు. కానీ టీడీపీ కూటమి 23 ఎమ్మెల్యే (టీడీపీ 14, జనసేన 9), మూడు ఎంపీ సీట్లు మాత్రమే ఇచ్చిందంటే కాపుల సంక్షేమం పట్ల వారికున్న చిత్తశుద్ధి తేటతెల్లమవుతుందని అన్నారు. కాపు సామాజికవర్గానికి జగన్ ప్రభుత్వం చేసిన మంచి గత 60 ఏళ్లలో ఏ ప్రభుత్వమూ చేయలేదని పేర్కొన్నారు. చంద్రబాబు ముసుగులో ఉన్నందునే పవన్ కల్యాణ్‌ను కాపులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కాపులకు చంద్రబాబు చేసిన సాయం రూ.1,340 కోట్లు మాత్రమేనని, కానీ సీఎం జగన్ ప్రభుత్వం కాపు నేస్తం ద్వారా అందించిన సాయం రూ.2,029 కోట్లని ఆకుల వివరించారు. గత 52 నెలల్లో 77 లక్షల మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల లబ్ధిదారులకు డీబీటీ ద్వారా రూ.22,333 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.16,914 కోట్లు అందిందని తెలిపారు. మొత్తం మీద రూ.39,247 కోట్ల మేర సీఎం జగన్ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందన్నారు. గత ఎన్నికలకు ముందు కాపులను బీసీల్లో కలుపుతానని చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చమని పోరాడిన ముద్రగడ కుటుంబాన్ని ఎంతగా హింసించిందో అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. తుని రైలు దహనం కేసులో కుట్రపూరితంగా వందలాది మంది కాపు యువతపై చంద్రబాబు కేసులు పెట్టిస్తే అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి వారందరిపై కేసులు ఎత్తి వేయించారని గుర్తు చేశారు. చంద్రబాబుపై దుమ్మెత్తిపోసిన పవన్ కల్యాణ్ తరువాత అతని పార్టీతో అనైతిక పొత్తు పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. అమరావతి రాజధాని అనేది ఒక కుల రాజధాని మాత్రమేనని, అక్కడ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజలు బతకగలరా అని ప్రశ్నించారు. రేపు పిఠాపురంలో పవన్‌ను ఓడించేది చంద్రబాబేనని తెలిపారు.

• ఉత్సాహంగా 2కే రన్





స్వీప్ కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణం నుంచి 2కే రన్‌ను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సీపీ టీకే రాణా, జేసీ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

తెలుగు భాష గొప్పతనాన్ని తెలుసుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఫాదర్ కిషోర్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తెలుగు భాష చాలా గొప్ప భాష అని, ఆ భాష గొప్పతనాన్ని నేటి యువతరం తెలుసుకొని భవిష్యత్ తరాలకు అందించాలని ఆంధ్రా లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్ చెప్పారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, సిద్ధార్థ విద్యాసంస్థల తెలుగు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషపై నీ పట్టు చూపెట్టు పేరుతో విద్యార్థులకు పోటీలు శనివారం సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సాయంత్రం ముగింపు సభ జరిగింది. కిషోర్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని భాషల కంటే తెలుగు భాష చాలా గొప్పదన్నారు. సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ తెలుగు భాషపై విద్యార్థులకు మక్కువ పెంచడానికి తమ కళాపీఠం ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. తెలుగు వాక్యాలతో అంత్యాక్షరి పోటీలో ప్రథమ బహుమతి వైపీ.రావు(సిద్ధార్థ బీఈడీ కళాశాల విద్యార్థులు), ద్వితీయ బహుమతి(పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు), ప్రోత్సాహక బహుమతి జేకేసీ కళాశాల విద్యార్థులు గెలుపొందారు. ఆంగ్ల పదాలు వద్దు తెలుగు మాటలే ముద్దు అనే పోటీలో ప్రథమ బహుమతి కేబీఎన్ కళాశాల విద్యార్థి ఆర్.అమృత్, ద్వితీయ బహుమతి జేకేసీ కళాశాల విద్యార్థిని బి.సౌమ్య, ప్రోత్సాహక బహుమతి సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థి టి.సాయి చరణ్ గెలుచుకున్నారు. తల్లి తండ్రి గురువు స్నేహితుడు వీరిలో నచ్చిన వారికి ప్రేమ పూర్వక లేఖ రాయడం పోటీల్లో సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థి ఎస్.అభిలాష్ ప్రథమ బహుమతి, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.కీర్తన ద్వితీయ బహుమతి, దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని ఎం. శ్రీవైష్ణవి ప్రోత్సాహక బహుమతిని పొందారు. ఆంగ్ల పదాలకు తెలుగులో సమానార్థకాలు రాయడం అనే పోటీలో సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థి బి.అమర నారాయణ ప్రథమ బహుమతి, నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థి ప్రభు కిరణ్ ద్వితీయ బహుమతి, సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థి వెంకట నారాయణ శర్మ ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. సిద్ధార్థ కళాపీఠం కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మి, సిద్ధార్థ అకాడమీ పాలనాధికారి టి.రమేష్, నిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ కె.సరళ, డాక్టర్ పి.నీరజ, ఎం.లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు శాలువా కప్పి స్వాగతం పలుకుతున్న స్థానికులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 32వ డివిజన్ రామలింగేశ్వరపేటలో శనివారం కో–ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణితో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజలు మంచి చేసిన సీఎం జగనన్నకు అండగా ఉంటామని ఫ్యాను గుర్తుకు ఓట్లు వేస్తామని అన్నారు. కులమత, రాజకీయాలకు అతీతంగా 32వ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమస్యలు పరిష్కరించామని గుర్తు చేశారు. ఇక్కడ ఓటు అడిగే అర్హత తమకు మాత్రమే ఉందని అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోని మైనార్ బొండాకు లేదని విమర్శించారు. మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని వెలంపల్లి కోరారు. మహిళలు, పలు పథకాల లబ్ధిదారులు హారతులు ఇచ్చి శాలువా కప్పి స్వాగతం పలికారు.

కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు..

ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన బొండా ఉమా కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నాడని ఎమ్మెల్యే వెలంపల్లి ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ వెంటే రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు అంతా ఉన్నారని పేర్కొన్నారు. బొండా ఎన్ని కుయుక్తులు పన్నినా రాబోయే ఎన్నికల్లో పరాభవం తప్పదని అన్నారు. సెంట్రల్ ప్రజలు బొండాను తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బొండా ఉమా పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడించినంత మాత్రాన ఏమి జరిగిపోదని అన్నారు. ప్రజలు ప్రతీ ఒక్క విషయం గమనిస్తున్నారని వారికి ఏం చేయాలో తెలుసునని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 32వ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్, పార్టీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్ఆర్, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

6న సిద్ధార్థలో విశ్లేషక్ – 2కే24



పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బిజినెస్ అనలిటిక్స్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు విశ్లేషక్ – 2కే24 పేరుతో ఏప్రిల్ 6వ తేదీన తమ కళాశాల ఆవరణలో వారు చదువుతున్న పాఠ్యాంశాలతో పాటు వివిధ సాంస్కృతిక అంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు చెప్పారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. బాబూరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ డేటా గేమ్, బిజినెస్ క్విజ్, స్టార్టప్ ఐడియా, స్పాట్ ఫొటోగ్రఫీ, మిస్టర్ అండ్ మిస్ అంశాల్లో విద్యార్థులకు పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులు ఈ పోటీలకు హాజరవుతారన్నారు. పోటీల విజేతలకు అదే రోజు సాయంత్రం బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న.. తెలుగు జాతికి గర్వకారణం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పీవీ నరసింహారావుతో ఎమ్మెల్యే విష్ణు (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న మన తెలుగువాడైన మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు సేవలకు గుర్తుగా అందించడం తెలుగుజాతికి ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ సమగ్రాభివృద్ధికి పీవీ సేవలు ఆదర్శనీయమని, దేశ ఆర్థిక వ్యవస్థను తన సంస్కరణలతో గాడిన పెట్టిన మహామేధావి అని కొనియాడారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా, నిరంతర సంస్కరణశీలిగా అంచెలంచెలు ఎదిగిన ఆయన జీవితం నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మన దేశం ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కి ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదిగిందంటే అందులో పీవీ చేసిన కృషి ఎంతో ఉందన్నారు. ఆయన బహుభాషా కోవిదుడని.. 14 భాషలు మాట్లాడగలిగిన ఏకైక ప్రధాని అని గుర్తుచేశారు. అసాధారణమైన ప్రతిభ, జ్ఞానం పీవీ సొంతమని కీర్తించారు. దేశ చరిత్రలో నిరంతర సంస్కరణశీలిగా పీవీ నరసింహారావు చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణలకు ఆయనే ఆద్యుడని.. భూసంస్కరణల్లో భాగంగా తన ఆస్తిని ప్రభుత్వానికి అప్పగించినటువంటి మహోన్నత వ్యక్తి అని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాతో.. ముఖ్యంగా మచిలీపట్నం, విజయవాడ నగరంతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేదని ఎమ్మెల్యే అన్నారు. ఆ మహనీయుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. భావితరాలు పీవీ సేవలను స్మరించుకునే విధంగా సత్యనారాయణపురంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల అనంతరం సీఎం జగన్ చేతులమీదుగా పీవీ విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా విక్రయిస్తున్న బీర్, మద్యం బాటిల్స్‌ను కొత్తపేట పోలీసులు శనివారం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ యువకుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెక్టార్ ఎస్ఐ ఎల్.దేవసుధ శనివారం ఉదయం లంబాడీపేటలో గస్తీ నిర్వహిస్తుండగా, ఓ యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని ఆరా తీయగా, ఆ యువకుడు మాతంగి భార్గవ్(23)గా గుర్తించారు. నిందితుడు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. యువకుడిని అరెస్ట్ చేయడంతో పాటు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.